పార్కులో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఒ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా 16వ డివిజన్ పరిధిలోని జగదీష్ నగర్ పార్కు,14వ డివిజన్‌లోని వేప దరువు పార్కు, 11వ డివిజన్‌లోని మూడు జెండాల సెంటర్ పార్కు, ఈ.సి.ఎస్.ఆర్ పార్కు, 8వ డివిజన్ ప్రాంతంలోని రేబాల వారి వీధి పార్కు, బాల భవన్ పార్కు, 9వ డివిజన్ బంగ్లాతోట పార్కులను సందర్శించారు. పార్కులలో పచ్చదనం, క్రీడా పరికరాలు, ఆట వస్తువులు, ఇతర మౌలిక సదు పాయాలను కల్పించి అవసరమైన నిర్మాణ పనులను వేగవంతం చేసి, పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ రామ్మోహన్‌రావు, ఈఈ అనిల్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్టికల్చర్ నరసింహారావు,శానిటేషన్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులకు 'తమ్ముళ్ల' తలనొప్పి..!

◆ఇసుక, రేషన్, గ్రావెల్ దందాలు
◆నగరంలో "రియల్" వ్యవహారాలు
◆అధికారుల ప్రేక్షక పాత్ర

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సర్వం మారిపోతోందని భావించిన ప్రజలకు తమ్ముళ్లుఝులక్ ఇస్తున్నారు.. వైసిపి ప్రభుత్వంలో సాగిన ఇసుక, రేషన్, గ్రావెల్, దందాలు కొనసాగుతూనే ఉన్నాయి...నెల్లూరు నగరంలో రియల్ వ్యవహారాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మధ్యస్థాలు.. అయిన వారికి ఆకుల్లో... కానివారికి కంచాల్లో అన్న చందంగా . యథేచ్ఛగా సాగి పోతున్నాయి.. తప్పుచేసినా అధికారం అండ ఉంటే ఐతే ఒకే అన్నట్లు ఉంది.... రాష్ట మంత్రులు ఆనం రామనారాయణరెడి, పి. నారాయణ అభివృద్ధి అంటూ రాష్ట్రంలో తిరుగుతుండగా తమ్ముళ్లు మంత్రుల పేర్లు చెప్పుకొని దందాలు చేస్తున్నారు.. పోలీసు, రెవెన్యూ, మున్సిపాలిటీ ఒక్కటేమిటి అన్ని శాఖలను కొందరు తమ్ముళ్లు కను సైగల్లో నడుపు తున్నారనే ప్రచారం సాగుతోంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది... దీనికే అధికారపార్టీకి చెందిన కొందరు నేతలు తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం, మైనింగ్, భూదందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరిగాయి. అధికారం ఉన్న వారికే అంతా జరిగిపోయిందనే ప్రచారం జరిగింది. అప్పట్లో కొందరు నాయకలు ఈ దందాలు చేసే రాజకీయాలు నడిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అప్పట్లో జరిగిన దందాలు కొన సాగనివ్వమని చంద్రబాబునాయుడు చెప్పు కొచ్చారు. అధికారంలోకి వచ్చాక కొన్ని మంచి సంస్కరణలు తీసుకొచ్చారు. పేదలకు అందాలనే ఉద్దేశంతో 'ఉచిత ఇసుక' రేషన్ బియ్యం షాపుల్లో ఇవ్వడం, మైనింగ్‌లో గతంలో జరిగిన తప్పులు సరిచేయడం, రియల్ ఎస్టేట్ పేరుతో భూదోపిడీకి అడ్డుకట్ట వేస్తారని అందరూ ఆశించారు. ప్రభుత్వం గట్టిగా చెబుతున్నా కింద స్థాయిలో అంతా జరిగిపోతూనే ఉంది. మైనింగ్ విష యంలో ఇప్పటి వరకు మంచి విధానం తీసుకురాలేదు. మైనింగ్ ఒరిజనల్ లీజు దారులు ఇబ్బందులు పడుతున్నా కొందరు తెలుగు తమ్ముళ్లు మైనింగ్ అడ్డదారిలో కొనసాగిస్తున్నారు.

మంత్రులకు "తమ్ముళ్ల" తలనొప్పులు..! ఆనం రామనారాయణరెడ్డి

పొంగూరు నారాయణ

సీనియర్ రాజకీయ నాయకులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గతం కంటే స్పీడ్ తగ్గినట్లు కనిపిస్తోంది. కూటమిలో ఎవరి దారి వారిది కావడంతో తన మంత్రివర్గం, ఆత్మకూరు నియోజ కవర్గంలో మాత్రమే జోక్యం చేసుకుంటున్నారు. 45 సంవత్సరాల రాజకీయ అనుభవం కలిగిన ఆయనకు ఇప్పటి వరకు ఎలాంటి అవినీతి మరకలు లేవు. ఆనం కుటుంబానికి జిల్లాలో మంచి పేరు ఉంది. ఇటీవల కాలంలో ఆయన రాజధాని, రాష్ట్రంలోని దేవాలయాల పునరుద్ధరణ అంటూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలో ఇసుక, రేషన్ బియ్యం, భూ వివాదాలు, దందాలో తమ్ముళ్ల పెత్తనం పెరిగిపోయింది,. మంత్రి పక్కనే తిరిగే కొందరు నేతలు అధికారులకు మంత్రి పేరు చెప్పి అంతా జరుపుతున్నా మౌనంగా ఉంటున్నారనే ప్రచారం ఉంది. ఇటీవల సంగం వద్ద జరిగిన ఇసుక టిప్పర్ యాక్సిడెంట్‌లో మంత్రి ఆనం అనుచరుల పేరు ముందుకొచ్చింది. మంత్రి మౌనంగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణాలో ఆయన అనుచరులు పాత్ర ఉందనే ప్రచారం సాగుతోంది. అనంతరం నెల్లూరు నగరంలో 1800 కింట్వాళ్లు రేషన్ బియ్యం పట్టుపడడంతో టిడిపి నేతల పాత్ర ముందుకొచ్చింది. అనంతసాగరంకు చెందిన మంత్రి అనుచరుడు ఈ వ్యవహారంలో ఉన్నారని తెలిసిందే. ఆత్మకూరు నియోజకవర్గంలో భూవివాదాలు ముంద ుకొస్తున్నాయి. అధికారపార్టీ నేతలు చెప్పిందే రెవెన్యూ అదికారులు పాటిస్తూ, కొందరికి అన్యాయం చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ విషయాల్లో మంత్రి ఆనం సీరియస్‌గా ఉండకపోవడంతో కొందరు నేతలు ఆయనకు చెడ్డపేరు తీసుకొస్తున్నారని ఆపార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. నెల్లూరు నగర ఎంఎల్ఎ రాష్ట్రంలో కీలకంగా ఉన్న మంత్రి పి.నారాయణ అమరావతి, అభివృద్ధి అంటూ తిరుగుతున్నారు. ఇదే సమయంలో నియోజకవర్గంలో పార్కులు, స్కూళ్లు, రోడ్లు, డ్రెయినేజీ, వంటి విషయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. ఇక్కడ పనులన్నీ తెలుగు తమ్ముళ్లకు కట్టబెడుతున్నారు. అభివృద్ధి ఫలాలు టిడిపి నాయకులు, కార్యకర్తలకు అందాలనే ఉద్దేశమే ఎక్కువగా కనిపిస్తోంది. ఆయనకు ఉన్న తక్కువ సమయంలో తన నియో జకవర్గ అభివృద్ధి, టిడిపి నాయకులు ఆర్థిక పరిపుష్టిమీదే దృష్టిపెడుతున్నారు. ఇది వచ్చే ఎన్నికల్లో తనకు ఉపయోగపడేలా చూసుకుంటున్నారు. ఇంత వరకు అలా ఉంటే నగర నియోజకవర్గంలో కొందరు టిడిపి ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇసుక, రియల్ దందాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మధ్యస్థాలతోనే సరిపెడుతున్నారనే విమర్శలున్నాయి. తప్పు చేసినా అధికారపార్టీ నేతల అండదండలుంటే సరిపోతోంది. మంచి చెడు చూడకుండా అధికారులు తానా తందానా అంటున్నారనే బహిరంగ విమర్శలున్నాయి. మంత్రి నారాయణ మంచిగా ఉన్నా కింద స్థాయిలో తమ్ముళ్లు చేస్తున్న చేష్టలు ఆయనకు చెడ్డ పేరు తీసుకొస్తున్నాయి. కాంట్రాక్టు పనుల కోసం తమ్ముళు సిగపట్లు పట్టుకుంటున్నారు. టిడిపి నాయకుల సిఫార్సులు లేకుండా ఏ ఒక్క ఆఫీసులో చిన్నపని జరగడం లేదు ఇది ప్రజల్లో అసంతృప్తి, అసహనం కలిగిస్తోంది. ఇద్దరు మంత్రులు తమ పనుల్లో బిజీ బిజీగా ఉండగా, ఆయన పక్కనే తిరిగే కొందరు నాయకులు వారి పేర్లు చెప్పి అంతా చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఇక్కడ కనిపిస్తుండడంతో ముక్కున వేలేసుకుంటున్నారు. గతం కంటే అభివృద్ధి, సంక్షేమంలో మార్పు కనిపిస్తున్నా, గతంలో జరిగిన అవినీతి, అక్రమాల విషయంలో పెద్దగా మార్పు కనిపిచడం లేదని చెవులు కోరుకుంటున్నారు. సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆశపడుతున్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి - ఆటో కార్మికులకు నగదు జమ

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని, రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్టోన్ హౌస్ పేట, లక్ష్మీపురం లోని ఎస్ బి ఎస్ కళ్యాణ మండపంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పదిలక్షల కోట్ల రూపాయలకు వడ్డీలతోపాటు అసలు చెల్లిస్తూ పథకాలను ప్రారంభిస్తుం దన్నారు. రాష్ట్రం మొత్తం మీద 3 లక్షల 12 వేల దరఖాస్తులు రాగా స్క్రూట్ ని అనంతరం 2,91,000 మందిని అర్హులుగా ప్రకటించి వారికి రూ.15వేల వంతున ఒకేసారి రూ. 435 కోట్లు నేరుగా వారి ఖాతాలలోకి ప్రభుత్వం జమచేసిందన్నారు. జిల్లాలో సుమారుగా 17,406 మంది డ్రైవర్లకు గాను రూ.26 కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరో మంచి పథకానికి శ్రీకారం చుట్టిందని దానికి సంబంధించి నేడు జిల్లా మొత్తం మీద 17406 మంది డ్రైవర్లకు 26.1 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాలోకి జమ చేసినట్లుతెలిపారు. కమిషనర్ నందన్, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ చందర్ మరియు డ్రైవర్ యూనియన్ నాయకులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత జిల్లాలోని 17,46 మందికి సంబంధించి 26.1 కోట్ల రూపాయలు భారీ చెక్కును రూరల్ కు సంబంధించి 1821 మందికి గాను రెండు కోట్ల 73 లక్షల భారీ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

కందుకూరు : కందుకూరులో వందల ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్ఎ ఇంటూరి స్వయంగా ఆటో నడిపారు. 1004 మంది ఆటో డ్రైవర్లకు 1.50 కోట్ల రూపాయల జమ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ర్యాలీ పామూరు రోడ్ జంక్షన్, ఎన్టీఆర్ బొమ్మ మరియు అంకమ్మ గుడి మీదుగా మార్కెట్ యార్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ కమిషనర్ కే అనూష, ఆర్డీవో టి.వి.ఎన్ లక్ష్మి, కందుకూరు ఎమ్మార్వో లావణ్య ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు శ్రీనివాసులు, శంకర్రావు, సురేష్, ఓబులేసు, కందుకూర్ పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

శాస్త్రవేత్తల క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలంలోని అలగాయపాలెం గ్రామంలో వేరుశనగలో రైతులు పండించే టి ఏజ్-24 రకానికి ప్రత్యామ్నాయంగా టిఎజ్-73 అనే నూతన రకాన్ని రైతులకు ప్రదర్శన క్షేత్రంలో భాగంగా పరిచయం చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా కషి విజ్ఞాన కేంద్రం కందుకూరి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి ప్రసాద్ రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ రకం 105 రోజుల పంటకాలం కల్గి ఎకరుకు15 నుండి 18 క్వింటాళ్ళ దిగుబడినిచ్చే సామర్థ్యం కలిగి నూనె శాతం 49 శాతం ఉండి, 40 శాతం వరకు 3 గింజల కాయలు కలిగి పంట చివరి వరకు పచ్చగా ఉండే లక్షణాలు కలిగి ఉందని డా.ప్రసాద్ తెలిపారు. ఈ రకం వేసిన పొలంలో గ్రామంలోన్ అందరి రైతులతో క్షేత్ర దినోత్సవం నిర్వహించి వారికి ఈ రకం ప్రత్యేక లక్షణాలను, దిగుబడులను ప్రత్యక్షంగా రైతులకు వివరించారు. రైతులు మాట్లాడుతూ ఈ నూతన రకం మంచి ఫలితాలు ఇచ్చిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డా.వెంకటేష్, డా.జ్యోతి, మాయాంక్, వివేక్, రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు,రైతులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో వ్యవసాయ రంగం బలోపేతం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-నెల్లూరు

వ్యవసాయంలో యాంత్రీకరణను పూర్తిస్థాయిలో అమలు చేస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రైతులు, వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లతో వ్యవసాయంలో యాంత్రీ కరణపై జరిగిన వర్క్ షాప్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాన్ని సుస్థిరమైన ఆదాయ వనరుగా మార్చేందుకు యాంత్రికరణ ఆవశ్యకమన్నారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి ఉత్పాదకత పెరిగి వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, టైం, కూలి ఖర్చులు అన్నింటిలో యాంత్రికరణ ద్వారా మిగులు ఉంటుందన్నారు. ఈ వర్క్ షాప్ లో ప్రదర్శించిన 60 రకాల యంత్రాలలో రైతులకు ముఖ్యంగా అవసరమయ్యే వాటిని వ్యవసాయ అధికారులు గుర్తించాలన్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలను అందించేందుకు బ్యాంకర్లు కషి చేయాలన్నారు. రైతులు, బ్యాంకర్లు మధ్య ప్రభుత్వం వారధిగా ఉంటుందన్నారు. ఇప్పటికే వివిధ రకాల యంత్రాలను ఉపయోగిస్తున్న రైతుల ద్వారా వారి అనుభవాలను తెలుసుకున్నారు. చివరిలో వరి పంటలో యూరియా వినియోగం గురించి ప్రత్యేకంగా తయారుచేసిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవతి, జిల్లా మత్స్య శాఖ అధికారి శాంతి, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పిడి సత్యనారాయణ, ఆత్మ పిడి మురళి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మాట్లాడుతున్న రావుల వెంకయ్య

30 యాక్టును రద్దు చేయాలి

సిపిఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య

ప్రజాశక్తి -ఉలవపాడు : ఉలవపాడు మండలం, కరేడు పంచాయతీలో పోలీసులు అమలు చేస్తున్న 30 యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ భూముల పట్ల వారికి స్వేచ్ఛ లేని విధంగా కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరేడు గ్రామంలో 30 యాక్ట్ అమలు చేయటం వల్ల గ్రామంలో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బయట ప్రదేశాలలో ఉండే తమ బంధువులు సైతం గ్రామాల్లోనికి రానికుండా 30 యాక్ట్ పేరుతో పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. కోర్టు ప్రభుత్వానికి పోలీసులకు ఎన్ని చివాట్లు పెట్టినా వారి పద్ధతి మారకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతులు ముక్తకంఠంతో ఇండో సోలార్ కంపెనీకి తమ భూములు ఇచ్చేది లేదని గ్రామ సభలో తెగేసి చెప్పిన కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రైతులను బెదిరింపు చర్యల ధోరణిలో బలవంతపు భూసేకరణకు పాల్ప డుతుందని ఆయన ఆరోపించారు.బలవంతపు భూ సేకరణను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు, సిపిఐ నాయకులు ఆనందమోహన్, మురళి, నరసయ్య, దుర్గ ప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, కె.మురళి, లక్ష్మీనారాయణ, రామ్మూర్తి, బొల్లోజుల బాల బ్రహ్మాచారి పాల్గొన్నారు.

13 గంటల పని విధానం సరికాదు : సిఐటియు

ప్రజాశక్తి-రాపూరు

:సిఐటియు మండల మహాసభ షాజీమంజిల్‌లో శనివారం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు అల్లాడి గోపాల్, పి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మిక రంగ సమస్యలను పరిష్కరిం చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులు కడుపు కొట్టే, జిఒలను తీసుకురావడం మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో 8 గంటల పనిని 13 గంటలు చేస్తున్నట్టుగా జిఒ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ, ఆశ, కార్మి కులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ బేస్ లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు పి శ్రీనివాసులు

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం నూతన కమిటని ఎన్ను కున్నారు. సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. 16 మందితో ఎన్ను కున్నారు. కన్వీనర్, కో-కన్వీనర్ గా కె ,శ్రీని వాసులు, కె,ప్రమీలమ్మ, ట్రెజరీగా టి సుజాతలను ఎన్నుకున్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

విద్యుత్ సబ్ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య నెల్లూరు టౌన్ డివిజన్ పరిధిలోని 33/11 కె.వి. సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన సబ్‌స్టేషన్‌లో అమలు జరుగుతున్న సాంకేతిక విధానాలు, నిర్వహణా పద్ధతులు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. 33 కె.వి. ఫీడర్లు,11 కె.వి. ఫీడర్లు పై ప్రస్తుత విద్యుత్ లోడ్, వినియోగదారుల సంఖ్య, ఓవర్‌లోడ్ ఫీడర్ల పరిస్థితులు వంటి వివరాలను డైరెక్టర్ గారు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫీడర్ పై సక్రమమైన లోడ్ బ్యాలెన్సింగ్ జరుగుతుందా, అవసరమైన ప్రమాణాల ప్రకారం ఫీడర్ మెయింటెనెన్స్ కొనసాగుతోందా అన్నది స్వయంగా పరిశీలించారు. నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కిరణ్, సుప్రియ, అసిస్టెంట్ ఇంజనీర్లు లక్ష్మీ బాయి, లక్ష్మి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగులు నింపే 'గురువు'..

1. తల్లి ఇచ్చిన ప్రాణానికి పరిమిళం నింపే పుష్పం..
తండ్రి చూపిన మార్గానికి వెలుగు జోడించే మూర్తి..
అక్షరానికి ఆకారం ఇచ్చే ఆత్మ స్వరూపమే గురువు..!

2. జీవిత మార్గానికి జ్యోతిని పంచే జ్ఞాన భాస్కరం గురువు..
పుస్తకాల ల్లోని అక్షరాలకు ప్రాణం పోసి పలికించేది గురువు..
పరాజయం భయంకాదు.అది జీవిత పాఠామని తెల్పేది గురువు..!!

3. విజయానికి వంతెన వేసే వేద వాక్యం బోధించేది గురువు..
జ్ఞాన గంగలో ప్రవాహానికి దారి చూపే దివ్య దీపం గురువు..
భావి తరాలకు వెలుగు మార్గం చూ పే మార్గదర్శి గురువు..
దేశాన్ని దివ్యంగా భవ్యంగా తీర్చి దిద్దే దార్శనికుడు గురువు..!!!

నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

సందర్భం

వై శ్రీనివాసులురెడ్డి, ఎస్ఎ, బయాలజీ, వరిగొండ హైస్కూల్, తోటపల్లి గూడూరు (మం)

డిజిటల్ మారథాన్‌కు గడువు పెంపు

ప్రజాశక్తి-నెల్లూరు

వికసిత్ భారత్ 2047 లో యువతను భాగస్వాములుగా చెయ్యాలనే లక్ష్యంతో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ నిర్వహిస్తున్న "ఆంధ్రయువ సంకల్ప్ 2 కె25 - అంబాసిడర్" డిజిటల్ మారథాన్ కు విశేష స్పందన వచ్చుచున్నందున అలాగే కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు నమోదు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు సెట్నెల్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎ.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి డిజిటల్ మారథాన్ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్ల నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 30 తో గడువు ముగియనున్నదన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సిఐటియు ఐక్య పోరాటం నినాదంతో దేశంలోనే అన్ని సమరశీల పోరా టాలలో సిఐటియు అగ్రభాగాన ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న సిఐటియు జిల్లా 12వ మహాసభలు నరుకూరు సెంటర్ శుభం ఫంక్షన్ హాలులో జరగబోతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ మండల కా ర్యదర్శి మారుబోయిన రాజా తెలిపారు. ఈ సందర్భంగా నరుకూరు సిఐటియు ఆఫీసులో సిఐటియు మండల అధ్యక్షురాలు ఎస్‌కె మస్తానమ్మ అధ్య క్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ప్రసాద్, రాజాలు పాల్గొన్నారు. మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సిఐటి యు మండల కార్యదర్శి, ఆశా వర్కర్స్ యూనియన్ జి ల్లా అధ్యక్షురాలు మధు సూదనమ్మ, ఆశా వర్కర్ హేమ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయ కులు రమణమ్మ, పద్మమ్మ, శారదమ్మ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు అన్నం పుట్టయ్య, చింతా రామసుబ్బయ్య, నాసిన పరుశురామయ్య, సుబ్బయ్య ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

6న వడ్డే ఓబన్న వర్థంతి

ప్రజాశక్తి-నెల్లూరు

స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 1846వ సంవత్సరం అక్టోబరు 6న కర్నూల్ జిల్లా రేనాటి ప్రాంతంలో బ్రిటీష్ వారితో జరిగిన పోరాటంలో వీర మరణం పొందారని, ఆయన వర్థంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ అన్నారు. శనివారం నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదిన వడ్డే ఓబన్న వర్థంతి కార్యక్రమం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వందలాదిమంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోటకొండ వెంకటేష్, జిల్లా కార్యదర్శి బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు గౌరవ అధ్యక్షులు బెల్లంకొండ వెంకయ్య జిల్లా నాయకులు బత్తల కష్ణయ్య లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్

ఎన్నికల కమిషన్ పరిశీలన : కలెక్టర్

ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ రిజిస్ట్రేషన్‌పై

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి" పార్టీ వార్షిక ఆడిట్ ఖాతాలు, ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్ణీత కాలవ్యవధిలో సమర్పించకపోవడంతో ఆ పార్టీ రిజిస్ట్రేషన్ రద్దుపై ఎన్నికల కమిషన్ పరిశీలనలో ఉందని కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 7లోపు వివరణ ఇవ్వడానికి, అక్టోబర్ 14న వ్యక్తిగత విచారణకు హాజరుకావడానికి కమిషన్ పార్టీకి నోటీసు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

స్థలం ఆక్రమణ సరికాదు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు పట్టణంలో ఓ జర్నలిస్టుకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించారు. దీంతో సదరు విలేకరికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, రావుల వెంకయ్య తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం ఆయన తన బృందంతో ఆక్రమణకు గురైన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సమాజానికి మూలస్తంభంగా ఉండే పాత్రికేయులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జీతభత్యాలు లేకుండా ప్రభుత్వానికి ప్రజ లకు మధ్య వారధి లాగా ఉంది సమస్యల పరిష్కారంలో వారి పాత్ర ఎంతో విలువైనదన్నారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఆక్రమణ చేయడం సరికాదన్నారు.విలేకరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరులో బాలిక సల్మాకు ప్లేట్లెట్స్ తగ్గి కడుపులో ఇన్ఫెక్షన్ వచ్చింది. టైఫాయిడ్ జ్వరంతో ఒక ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతోంది. చికిత్స కోసం అవసరం అయ్యే డబ్బులు లేక ఆర్థిక పరిస్థితుల దష్ట్యా పాప తల్లిదండ్రులు కందుకూరు ఐఎఫ్‌సి ఫౌండేషన్ వారిని సంప్రదించారు. కందుకూరు పట్టణంలో మొబైల్ రంగంలో, సేవా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న స్నేహశీలి, మదుస్వభావి సలాం విషయం తెలుసుకుని ముందుకు వచ్చారు. అత్యవసర చికిత్స కోసం 5000/- ఆర్థిక సహాయం ఫౌండేషన్ సెక్రటరీ షంషేర్ కి అందించారు. ఫౌండేషన్ సభ్యులు సలాంకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

'బిజిల్ యాప్' ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ ప్రజలకు మరింత సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో బండి అమర్ రెడ్డి ఏర్పాటు చేసిన బిజిల్ యాప్‌ను శనివారం కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఆయన కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం టెక్నాలజీ వైపు పరుగులు తీస్తున్న తరుణంలో, మన కావలి ప్రజలు కూడా టెక్నాలజీ సద్వినియోగం చేసుకునే అవకాశం లభించాలని, ఆ దిశగా బిజిల్ యాప్ రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. గ్రాసరీలు, ఫుడ్ ఐటమ్స్, రెస్టారెంట్ ఆర్డర్లు, గృహ అవసరాల వస్తువులు అన్నీ ఇప్పుడు ఇంటికే చేరేలా ఈ యాప్ సేవలు అందిస్తుందన్నారు. ఇప్పటికే నెల్లూరులో ప్రజాదరణ పొందిన ఈ యాప్ ద్వారా మన కావలి ప్రజలు కూడా సులభంగా ఆన్‌లైన్‌లో సరుకులు ఆర్డర్ చేయొచ్చని వివరించారు. ఇది మన తెలుగు యువకులు రూపొందించిన లోకల్ యాప్ అని, సమస్యలు ఏమైనా తలెత్తినా, స్థానిక టీమ్ వాటిని తక్షణమే పరిష్కరిస్తుందన్నారు. అందువల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. తక్కువ ధరలకు, తక్కువ సమయంలో వస్తువులు ఇంటికే చేరుతాయని ఎంఎల్ఎ తెలిపారు. కావలి పట్టణంతో పాటు అల్లూరు, బోగోలు, దగదర్తి, కావలి రూరల్ మండలాలు వంటి పల్లెటూర్లలో కూడా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. లోకల్ ప్రతిభను గౌరవిద్దామని, మన మేక్ ఇన్ ఇండియాకి బలం చేకూర్చుదామన్నారు. కార్యక్రమంలో గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, యాప్ నిర్వాహకులు బండి అమర్‌రెడ్డి, దావులూరు దేవకుమార్, జ్యోతి బాబురావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత పాల్గొన్నారు.

రీసర్వే దగ్గరుండి చేయించుకోండి..

ప్రజాశక్తి-ముత్తుకూరు : గ్రామపంచాయతీలో జరగనున్న రీసర్వే ప్రక్రియను రైతులు దగ్గరుండి చేయించుకోవాలని తహశీల్దార్ స్వప్న సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నుండి బస్టాండ్ సెంటర్ వరకు ఈ అంశం పైన ర్యాలీ నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ హాజరయ్యారు. రైతులు వాస్తవ విషయాలు అధికారులకు తెలియపరచి సమగ్రమైన రికార్డు నమోదు చేయించుకోవాలని తహశీల్దారు అన్నారు. కార్యక్రమంలో గ్రామ విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

ప్రజాశక్తి-ముత్తుకూరు : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు సేవలో ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి 15వేల రూపాయలు ఆర్థిక సాయం అనే కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ సభ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలు పూర్తిస్థాయిలో నిర్వీర్యం అయినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంక్షేమం అమలు చేస్తూ అభివృద్ధి, పోలవరం నిర్మాణం తో పాటు రాజధాని పూర్తవు తుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 2601 మంది ఆటో డ్రైవర్లకు నాలుగు కోట్ల రూపాయలు జామ చేసినట్లు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాధారణ వ్యక్తిగా ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు అవగాహన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : పెట్టుబడిదారుల విద్యా కార్యక్రమం అవగాహన పై నివేశ్ బస్ యాత్రను నిర్వహిస్తున్నట్లు, కెనరా రొబెకో ఎఎంసి మేనేజింగ్ డైరెక్టర్ రజనీష్ నరులా ప్రకటనలో తెలిపారు. కెనరా రొబెకో ఎఎంసి పెట్టుబడిదారులకు అవగాహన పెట్టుబడుదారులకు అవగాహన కోసం బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం మీదుగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 30నుంచి అక్టోబర్ 3 తేదీ వరకూ అవగాహన యాత్ర కొనసాగుతుందని తెలిపారు. సంపద సృష్టికి దీర్ఘకాలిక విధానాన్ని అవలంబించడంలో సహాయపడటం తమ లక్ష్యమన్నారు.

వినియోగదారులకు సకాలంలో అందించాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : సకాలంలో వినియోగదారులకు ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని, ఫ్రెష్ ఇండియా డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. పట్టణాలకు అమెజాన్ ఫ్రెష్ విస్తరించనున్నట్లు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు, విజయనగరం, తిరుపతి, మొత్తం 270 పట్టణాలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. పండ్లు, కూరగాయలు, పప్పుదినుసులు, గృహావసర సామాన్లు, సుమారు40వేల ఉత్పత్తులను సకాలంలో అందించనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు వద్ద ఏర్పేడు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. కారుబోల్తా కడప జిల్లాపొద్దుటూరు నుంచి పెంచలకోన కుదేవ దర్శనానికి వెళ్లి వస్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డును ఢీ కొట్టి కారు బోల్తా పడింది. ప్రమాద సమయంలో కారులో నలుగురు చిన్నారులు ముగ్గురు పెద్దవారు ఉన్నారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

గంధమహోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట (రహమతాబాద్)లో వెలసియున్న గౌసే ఆజం దస్తగీర్ స్వాములవారి 42వ గంధమహోత్సవం గుల్జార్ రఫాయి సజ్జద నషీన్ సయ్యదిషా కాజా అక్బర్ రఫాయి ఖాజామీ హుసేని ఆధ్వర్యంలో శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ గంధమహోత్సవం ముందుగా గంధాన్ని జామా మసీదు నుండి ఖాజా నాయబ్ రసూల్ దొరసామ్మ దర్గాకు మేళతాళాలతో ఫకీరుల జరుబులతో, బాణాసంచా వెలుగులతో, ప్రత్యేక ప్రార్థనల తో గంధాన్ని దర్గాకు చేర్చారు. ఆ గంధాన్ని ప్రజలకు పంపిణీ చేశారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో తలమంచి రైల్వే స్టేషన్ యార్డులో 190/25ఎ-27 పోస్టుల మధ్య ఎగువ లైనులో గుర్తు తెలియని 25-30 సంవత్సరాల గల పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు కావలి జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడు చామనచాయ 5.3 ఎత్తు, ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, కాఫీ కలర్ ఫుల్ హ్యాండ్ షర్టు, బూడిద రంగు ప్యాంటు,.. బ్లూ రంగు దుస్తులు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వివరాలు తెలిసి ఉంటే కావలి రైల్వే జిఆర్‌పి పోలీస్ స్టేషన్‌లో తెలపాలని తమ ఫోన్ నెంబర్ 9838343638 తెలపాలన్నారు.

మాలకొండారెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-కావలి : లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డికి కావలి సబ్ జైల్లో అభినందనలతో సత్కరించిన కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్ రావు, సబ్‌జైల్ అధికారి చిన్నుబుజ్జయ్య మాలకొండారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఖైదీల సంక్షేమ దినం సందర్భంగా జైలు అధికారి మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్న మాలకొండా రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది ఐ.సాయి ప్రసాద్, జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ పర్యటనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వింజమూరు : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ 19న సభకు వేలాది మంది తరలి రావాలని మంద వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు శనివారం స్థానిక విజయ్ ఫంక్షన్ హాలులో ఉదయగిరి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు మంద వెంకటేశ్వరరావు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు జిల్లా ఇన్‌ఛార్జి మంద.వెంకటేశ్వర రావు మాదిగ, ఎంఎస్‌పి జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు మాదిగ పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అదేవిధంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపోగు ఉదయ్ కృష్ణమాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షులు మంద సుజాత మాదిగ, బెజవాద బాల గురవయ్య మాదిగ, గొలపల్లి మాల్యాద్రి మాదిగ, గంగపట్ల సింహాద్రి మాదిగ, గోచిపాతల ఆనంద్ రావు మాదిగ, గోసాల సుధాకర్ మాదిగ, మేటలంటి సుధాకర్ మాదిగ, కొడవటిగంటి రాజ్ కిరణ్ మాదిగ, చెరుకూరి వెంకటేష్ మాదిగ, పొప్పు తిరుపాలు మాదిగ, బుర్రి అరుణ్ మాదిగ, కంచిపాటి బాలభూషణ్ మాదిగ, గంగపట్ల వెంగళరావు మాదిగ, పేముల తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం

పలుచోట్ల 'ఆటో డ్రైవర్ల సేవలో..'

కావలిలో..

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-కావలి

ప్రజల దైనందిన జీవితంలో కీలక భాగస్వాములైన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం కావలి పట్టణంలో నిర్వహించిన "ఆటో డ్రైవర్ల సేవలో" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముసునూరులోని ఎంఎల్ఎ కార్యాలయం నుండి మద్దూరుపాడులోని ఎస్ఎంకె కళ్యాణ మండపం వరకు ఆటోను 6కిలోమీటర్లు నడిపి, డ్రైవర్లతో మమేకమయ్యారు. ప్రజలతో డ్రైవర్లతో మాట్లాడుతూ ఆయన వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల బతుకులు సుఖంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలలు కంటున్నారన్నారు. డ్రైవర్ వర్గం వంటి కష్టజీవులు ఆర్థికంగా స్థిరపడాలనేది ఆయన సంకల్పమన్నారు. కావలి నియోజకవర్గంలో 1888 మంది ఆటో డ్రైవర్లకు రూ.15వేల చొప్పున మొత్తం రూ.2.84కోట్లు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమం లో కావలి ఆర్‌డిఒ సన్నీ వంశీకృష్ణ, డిఎస్‌పి శ్రీధర్, ఆర్‌టిఒ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, తహశీల్దార్ పి.శ్రావణ్ కుమార్, కావలి ఎంపిడిఒ శ్రీదేవి, బోగోలు ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, కావలి ఎఎంసి చైర్మన్ పోతగంటి అలేఖ్య, టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, రూరల్ మండలం అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుందని కూటమి ప్రభుత్వం అయితే స్త్రీ శక్తి పథకంలో తాము నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారని ఆటోడ్రైవర్లకు అండగా నిలిచేందుకు ఈ ఆర్థికసాయం అందజేస్తున్నామని వక్తలు పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నెల్లూరుపాళెం నుండి ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం వరకు ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ భూమిరెడ్డి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, డి.ఎస్.పి. కె.వేణుగోపాల్ మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు 1636 మంది అర్హత కలిగిన ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారికి సంవత్సరానికి రూ.2.45కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు నమూనా చెక్ ను అధికారులు, కూటమి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, ఎంవిఐ రాములు, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తహశీల్దారు పద్మజ, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కేత విజయభాస్కర్ రెడ్డి, గౌస్‌బాషా, సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : వైసిపి నేతల నోటి దురుసు మాటలతోనే వైసిపికి పతనం తప్పదని సోమరాజుపల్లి టిడిపి నాయకులు దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో ఆటో కార్మికుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సోమరాజుపల్లి టిడిపి నాయకులు దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఈదురు చెన్నయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆటోకార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈదురు వినోద్, హరి, నాగిరెడ్డి వెంకటరమణయ్య, షరీఫ్, ఆటో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి : శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాలతో కూటమి నాయకత్వం ఆటోవాలా భారీ ర్యాలీలో ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం వారి సంక్షేమానికి రూ.436 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక గండిపాలెం సర్కిల్ నుండి ఆటో డ్రైవర్లు ఆటోలతో టిటిడి కళ్యాణమండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఆటోడ్రైవర్లు నిర్వహించిన ర్యాలీలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆటోను నడిపి ఆటోవాలా లకు మద్దతుగా నిలిచారు. అనంతరం టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి టిడిపి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, అధ్యక్షత వహించారు. ఆటో డ్రైవర్లను యూనియన్ నాయకు లను, ముఖ్య అతిథులు నాయకులు, శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డిని స్థానిక నాయకులు ఆటోడ్రైవర్లు యూనియన్ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, కదిరి రంగారావు, రాజకీయ కార్యదర్శి మాలేపాటి చైతన్య, రాష్ట్ర కార్యదర్శి ఎలిసి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ కలివేల జ్యోతి మద్దసాని వెంకటేశ్వర్లు, మట్ల శాంతి, ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్ కే రియాజ్, సొసైటీ చైర్మన్లు, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, గడ్డం వెంకటేశ్వర్లు, అల్లిక మధు, గండిపాలెం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్లు, సీనియర్ నాయకులు ,గూడా నరసారెడ్డి, కప్ప ప్రభాకర్, చింతల శ్రీనివాసులు, పేలపూడి వెంకటరత్నం, ఉండేల గురువారెడ్డి, చంద్ర మధుసూదన్ రావు, బిజ్జం కృష్ణారెడ్డి, పోలినేని చంద్రబాబు, పులిగుంట్ల మధుమోహన్ రెడ్డి, తిరుమలరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు వ్యకాసం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కొడవలూరు : పోరాటాల పురిటి గడ్డ అయిన యల్లాయపాళెం గ్రామంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా 20వ మహాసభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భూలోకం కాంతారావు తెలిపారు. ఈ మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు ఉపాధి హామీ కూలీలు ఆటో కార్మికులు అసంఘటిత కార్మికులు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆదివారం ఉదయం 10గంటలకు మహాసభను ప్రారంభి స్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రదర్శన నిర్వహించి అనంతరం జెడ్డా మస్తానయ్య, వెంకోజీ బట్టేపాటి, సామెల్ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్మిక సోదరులు అత్యధికంగా పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉప్పుటూరు సుబ్బలక్ష్మికి అభినందనలు

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఆశీస్సులతో ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా నియమితులైన రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి ఉప్పుటూరు బాలాగురు స్వామి సతీమణి సుబ్బలక్ష్మి శనివారం ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దేవాలయ పాలక మండలుల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప్పుటూరి బాలగురుస్వామి, పెనుబాపల వెంకటేశ్వర్లు, నాయీ బ్రాహ్మణ సంగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి మహిల్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కావలి : 10వ ఆంధ్ర నావెల్ యూనిట్‌కు చెందిన బండి మహిల్ స్థానిక వెంగళ రావు నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2 వరకు పది రోజుల పాటు అరకు వ్యాలీలో ఎన్.సి.సి. నిర్వహించిన ట్రెక్కింగ్ శిక్షణ శిబిరానికి ఎంపికై, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని వచ్చిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు శనివారం ఉదయం ప్రార్థన సమయంలో కేడేట్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది ఫాహి ముద్దీన్, సరళ కుమారి, విజయలక్ష్మి, భాగ్యమ్మ, సజన, వాసవి, జనార్ధన్, రాజా, నాగలక్ష్మి, లావణ్య, తిరుపతయ్య, విజయ భారతి పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలస్థాయి ఎస్.జి.ఎఫ్ క్రీడా పోటీలు స్థానిక ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శాంతికి చిహ్నమైన తెల్ల పావురాలను ఎగురవేసి మండల విద్యాశాఖ అధికారి తిరుపతయ్య ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడల ప్రారంభ సూచికంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, కేజీబీవీ, మర్రిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థుల స్వాగత నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతగానో అవసరమని, క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు విస్తరిస్తాయని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. శనివారం 14, 17యేళ్ల బాలురు, బాలికలకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆదివారం షటిల్, టెన్నికాయిట్, యోగా, ఖోఖో తదితర అంశాలలో క్రీడా పోటీలు నిర్వ హించనున్నారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ క్రీడాపోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, కదిరి నాయుడు పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, కలిశెట్టి రాజేంద్రకుమార్, మర్రిపాడు ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రమణయ్య, వివిధ పాఠశాలల పీడీలు హరినాథ్, బాబు, మనోజ్, పద్మ, అఫ్రోజ్, సిఎంఆర్‌టిలు శ్రీనివాసులు, కస్తూరయ్య,పాల్గొన్నారు.

రైతు సంఘం మండల మహాసభ

ప్రజాశక్తి-విడవలూరు : మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభను నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులుగా మడపర్తి అంకయ్య, గుర్రం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో 9 మందితో మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ పాల్గొని దేశంలో రాష్ట్రంలో రైతుల ఎదుర్కొన్న సమస్యలపై తెలియజేశారు. యూరియా కొరత వాస్తవంగా లేదని కేంద్ర ప్రభుత్వం మోసపూరిత విధానం వల్లే ఇది ఈ యూరియా కోసం ఏర్పడినదని దానికి చంద్రబాబు నాయుడు తందానా అనటం మరీ దుర్మార్గమని యూరియాని రైతులందరికీ సకాలంలో అందే విధంగా ఏర్పాటు చేయాలని మద్దతు ధర రైతులందరికీ అందేవిధంగా కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాలు, మడపర్తి అంకయ్య, మడపర్తి మస్తానయ్య, తలారి సురేష్ పాల్గొన్నారు.

ధర్నా జయప్రదానికి పిలుపు

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించాలని, 12వ పిఆర్‌సి నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సిపిఎస్ రద్దు, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, పెండింగ్ బకాయిలు చెల్లింపు తదితర డిమాండ్ల సాధన కోసం 7వ తేదీ విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద జరిగే రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ.సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి వద్ద ఫ్యాప్టో సభ్యసంఘాల బాధ్యులతో కలసి ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫాప్టో కార్యవర్గసభ్యులు ఎస్.భాస్కర్ రెడ్డి, ఫ్యాప్టో కార్యవర్గసభ్యులు ఎం.గంగాధర్ మాట్లాడుతూ బదిలి పొంది రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో బాధ్యులు బి.శివప్రసాద్, ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి, జె.కొండయ్య, వి.మల్లికార్జున, ఆర్.రామసుబ్బారెడ్డి, హెచ్.హరికృష్ణ, కె.పెంచలయ్య, వి.వెంకటేశ్వర్లురెడ్డి, షేక్ కరీం మొహిద్దీన్, కె.సుధాకర్, వై.రమణారెడ్డి, వై.చంద్రమోహన్ రెడ్డి, మోహన్ రావు, సిహెచ్ శివకుమార్, ఇస్మాయిల్, ఎస్.శివరామిరెడ్డి, షేక్.సంధాని, షరీఫ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో కోవూరు పట్టణంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఫ్యాప్టో కమిటీ పిలుపు మేరకు తాలూకా స్థాయిలో జరిగిన ఈ ర్యాలీ తాలూకా కార్యాలయం నుంచి ప్రారంభమై మండబయలు సెంటర్ మీదుగా బజాజ్ సెంటర్ వరకు సాగింది. బజాజ్ సెంటర్ వద్ద ఉపాధ్యాయులు మానవహారం నిర్వహించి నినాదాలతో ప్రభుత్వాన్ని నిలదీశారు. "ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించక పోతే కూటమి ప్రభుత్వం మూల్లను చెల్లించక తప్పదు" అని ఫ్యాప్టో నాయకులు హెచ్చరించారు. ఈ ర్యాలీలో ఫ్యాప్టో నియోజకవర్గ కన్వీనర్ పి.మురళీకృష్ణ, చెంచురామయ్య, ఖాజావలీ, నాగిరెడ్డి, రమేష్, భారతి, విజయమ్మ, జమీర్ అహ్మద్, శ్రీనివాస ప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకయ్య, పుట్టయ్య, బత్తల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు ఓబయ్య, తదితరులున్నారు.

వింజమూరులో..

ప్రజాశక్తి-వింజమూరు : విజయవాడలో 7వ తేదీ జరుగునున్న ఫ్యాప్టో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వింజమూరులోని జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వండని, బోధోనేతర పనుల నుండి విముక్తి కలిగించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధన 12వ పి.ఆర్.సి. మధ్యంతర భృతి కారుణ్య నియామకాలు సిపిఎస్ రద్దు, తాము 57 అమల్లో ఉన్న పెండింగ్ బకాయిలు తదితర డిమాండ్లపై సాధన కోసం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించాయ న్నారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు చెంచల బాబు, వెంకటేశ్వర రెడ్డి, వీరాంజనేయులు, ఎపిటిఎఫ్ నాయకులు మోహన్ రెడ్డి, మల్లికార్జున, హెచ్ఎంఎ బాధ్యులు మాలకొండయ్య, పిఇటి సంఘం నుంచి ప్రభాకర్ రెడ్డి, ఇతర మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

'టిడిపి'వి కక్షపూరిత రాజకీయాలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

: తెలుగుదేశం ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తూ వైసిపి నాయకుల నుండి కార్యకర్తల వరకు ఎంతో ఇబ్బందులకు గురిచేస్తుందని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని షాదీ మంజిల్ వద్ద వైసిపి మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాల్లో గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లా డితే అక్రమ అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి, కోవూరు మండల అధ్యక్షులు అనూప్ కుమార్ రెడ్డి, కొండూరు అనిల్ బాబు, కవరగిరి లత, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి

కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ ఎస్‌సి యువతీ యువకుల కోసం డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణా కార్యక్రమం పిఎం అజయ్ అనే పథకం ద్వారా రోజూ కేవలం 4గంటలు, 2నెలల పాటు జరుగునని ఈ శిక్షణా కార్యక్రమంలో 17సంవత్సరాలు నిండిన ఎస్‌సి వర్గానికి చెందిన వారందరూ శిక్షణలో పాల్గొని ప్రభుత్వ సర్టిఫికేట్ పొందాలన్నారు. ఆలాగే ఆసక్తి కల్గిన ఉన్నవారికి ప్లేస్మెంట్ కూడా అందిస్తామని పత్రికాముఖంగా తెలపడంతో పాటు ఈ శిక్షణ కోసం ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఉచిత స్టేషనరీ తోపాటు దూరం నుండి వచ్చిన వారికి ఉచిత బస వసతి కూడా ఏర్పాటు ఉందని ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ కోర్సు కోసం 9177327797 ఫోన్ నంబర్ ద్వారా లేదా ఉదయగిరి కావలి రోడ్ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న న్యాక్ కార్యాలయంలో సంప్రదించ గలరన్నారు. పరిమిత సీట్లు కనుక ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

గ్రామ సచివాలయంలో సందర్శన

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని మినగల్లు గ్రామ సచివాల యాన్ని శనివారం ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ సందర్శించారు. ప్రభుత్వం జిఎస్‌టి స్లాబులను గతంలో ఉన్న 18, 28శాతాలను 5, 12శాతాలుగా తగ్గించినందున తగ్గించిన రేట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. జిఎస్‌టి రేట్లు తగ్గించినందు వల్ల ప్రతి కుటుంబం సగటున రూ.15వేల ఆదాయం పొందే అవకాశం ఉంది కాబట్టి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది ఈ విషయమై ప్రజలకు తగు సమాచారం అందజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో రసాభసా

ప్రజాశక్తి-కొండాపురం

కొండాపురం మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బొడ్డు అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిగుంట సర్పంచ్ దార్ల గోపి తమ గ్రామంలో ఉపాధి హామీ పనులు ఫీల్డ్ అసిస్టెంట్ ఉండగా మరో వ్యక్తికి లాగిన్ ఇచ్చి మస్టర్లు వేయించుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని ఇదేంటని సర్వసభ్య సమావేశంలో నిలదీశారు దార్ల గోపి వైసిపి సర్పంచ్ కావడంతో అక్కడే ఉన్న గొడవలు సర్పంచ్ మాచర్ల ప్రతికడించారు మీ పార్టీ హయంలో మీరు చేసింది ఏంటని ఇప్పుడు ఇలాంటి నీతి వాక్యాలు చెప్పడం కరెక్ట్ కాదని అన్నారు. మరుద్దరి మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఎంపిపి బొడ్డు అనురాధ కలగజేసుకొని సభను సజీవంగా సాగేలో చూడాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్క రించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

రిజిస్ట్రేషన్ వివాదం

- కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కలకలం

ప్రజాశక్తి కోవూరు

తనగోడు వెళ్లబోసుకుంటున్న వృద్ధురాలు

కోవూరు పట్టణం మరోసారి రిజిస్ట్రేషన్ వివాదంతో కదిలిపోయింది. విడవలూరు గ్రామానికి చెందిన ఏనేటి తులసమ్మ అనే వృద్ధురాలికి చెందిన భూమిని మోసం చేసి, ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై స్థానికంగా పెద్ద చర్చ మొదలైంది. తులసమ్మకు సొంతంగా ఉన్న 1.25 ఎకరాల భూమిపై ఆమె మనమడు ఏనేటి ఉరఫ్, వేనేటి సురేష్ కన్నేశాడు. ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ ఎస్.ఆర్. మోహనమ్మ సహకారంతో "పింఛన్ కోసం సంతకాలు అవసరం" అంటూ తులసమ్మను నమ్మబలికి సంతకాలు తీసుకున్నాడు. ఆ సంతకాలతో డాక్యుమెంట్ నంబర్ 850 / 2025 కింద తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

శనివారం తులసమ్మ కుటుంబ సభ్యులు కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు. "మాకు తెలియకుండా మా భూమిని ఎలా రిజిస్టర్ చేశారు? మా పిల్లలందరికీ రావాల్సిన వాటా ఒకరి పేరుతో ఎలా చేశారు?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు ముడుపులు తీసుకొని రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపిస్తూ, అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో మరో ట్విస్ట్ ఏమిటంటే, అక్కడ పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ ఉదయగిరి శ్రీనివాసులు బాధితులతో వాగ్వివాదానికి దిగారు. ఆగ్రహంతో ఆయన "గవర్నర్‌కి చెప్పుకో, సిఎంకు చెప్పుకో, పవన్ కళ్యాణ్‌కు, లోకేష్ కి చెప్పుకో.. నన్నెవరూ ఏమి చేయలేరు!" అంటూ వ్యవహరించారని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. అంతటితో ఆగలేదు. నా డబ్బులతో కొన్నాను అంటూ శ్రీనివాసులు కార్యాలయంలోని స్కానర్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. దాంతో శనివారం జరిగిన రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్లు స్కాన్ చేయడం సాధ్యం కాలేదు. దానివల్ల సిబ్బంది, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఈ ఘటనపై స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు తీవ్రంగా స్పందించారు. "సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రజల ఆస్తి రక్షణకు నిలయమవ్వాలి కానీ, ఇలాంటి అక్రమాలకు కేంద్రంగా మారడం విచారకరం" అంటూ విమర్శించారు. రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కోవూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో మరోసారి వెలుగులోకి వచ్చిన ఈ ఘటన, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పెరిగిపోతున్న అవినీతి, అహంకార ధోరణిని బట్టబయలు చేస్తోంది. ప్రజల న్యాయబద్ధమైన ఆస్తులపై మోసాలు కొనసాగితే, ప్రభుత్వ నిబంధనలపై ప్రజల నమ్మకం కోల్పోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలం లోని మినగల్లు కాలనీలో షార్ట్ సర్క్యూట్ వల్ల శుక్రవారం అర్ధరాత్రి ఓ షాపు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. బిసి కాలనీకి చెందిన పుట్టు రామయ్య, లక్ష్మమ్మ దంపతులు బ్యాంకు లోన్ ద్వారా కర్పూరం తయారుచేసే మిషన్‌ను విక్ర యించుకొని జీవనం సాగిస్తుండేవారు. ప్రతిరోజు లాగానే పని ముగించుకొని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా షాపులో నుంచి మంటలు చెలరేగాయి. మంటలు రావ డం గమనించిన చుట్టుపక్కల వారు బాధితులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాధితులు చూసేసరికి కర్పూరం మిషన్‌తో పాటుగదిలో ఉన్న చిల్లర సామాన్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. తాము జీవనం సాగిస్తున్న కర్పూరం మిషన్ దగ్ధమవడంతో రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి వారు జీవనోపాధి కోల్పో యారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు. పోలీసులు అక్కడికి చేరుకొని కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరిటైన్ బోర్డు భూముల సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

కావలి రెవెన్యూ డివిషనల్ అధికారి కార్యాలయం లో శనివారం, జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆనే మడుగు -మన్నంగిదిన్నె గ్రామస్తులకు సంబంధించిన మెరిటైన్ బోర్డు భూముల సమస్యల పరిష్కారార్థం రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎం.సన్నీవంశీకృష్ణ, మెరిటైన్ బోర్డుకు చెందిన ఎస్‌డిసి, కావలి తహశీల్దార్ పిశ్రావణ్ కుమార్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.